**జరిగిన కథ :** ధారానగరానికి వెళ్తున్న ఏడుగురు మిత్రుల కథ ఇది. ముగ్గురు ఇప్పటికే ఆ నగరం చేరుకున్నారు. నాలుగోవాడైన కుచుమారుడు తన విద్య ప్రభావంతో పురందరపురాన్ని ఏలే సరస్వతిని పెళ్లి చేసుకోవాల్సి ఉంది. కానీ, మోసానికి బలయ్యాడు. ఐదోవాడైన గోనర్దీయుడు అతణ్ని రక్షించాడు. ఆరోవాడైన చారాయణుడికి తన ప్రయాణంలో ఒక సిద్ధునితో అనుబంధం కలిగింది.






# గాడిదగా మారిన శిష్యుడు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

సిద్ధునికి చారాయణునిపై రోజురోజుకూ ప్రేమాను బంధం పెరగసాగింది. అదే సమయంలో వారిద్దరిపై భైరవునికి క్రోధం పెరగసాగింది. ఆ భైరవుడు సిద్ధునికి మొదటి శిష్యుడు. చారాయణుడు ఇటీవలే వచ్చాడు.

ఈ మధ్య సిద్ధుడు జపం మానేసి మరీ చారాయణునిపై వేదాంతగోష్ఠి జరుపుతున్నాడు. రాత్రీ పగలూ అతణ్నే అంటిపెట్టుకుని ఉంటున్నాడు. క్రమంగా అతనికి తన విద్యలు అనేకం ఉపదేశించాడు. చారాయణుడు కూడా ఆ విద్యలను శ్రద్ధగా నేర్చుకోసాగాడు.

ఒకనాటి రాత్రి సిద్ధుడు..

''చారాయణా! ఈ తెల్లవారుజామున మంచి ముహూర్తం ఉంది. నీకు వశిత్వ విద్య బోధిస్తాను. దాంతోపాటే కాంచనయోగం కూడా నేర్పిస్తాను'' అని చెబుతుండగా భైరవుడు విన్నాడు.

అసలు కాంచనయోగం నేర్చుకోవడం కోసమే భైరవుడు ఆ సిద్ధుణ్ని ఆశ్రయించాడు. వాడు పూర్వాశ్రమంలో సొంత ఊరిలోనే చాలా చెడ్డపేరు తెచ్చుకున్నాడు. దొంగతనాలు, జూదాలు మరిగాడు. ఎవరైనా.. 'ఇదేమిరా!?' అని నిలదీస్తే.. దేవాలయాల్లో దీపాలు ఆర్పి, భారతం నెత్తిన పెట్టుకుని 'ఏ పాపమూ ఎరగను' అని శపథం చేసేవాడు. ఒకసారి రాజభటులు తరుముతుంటే తప్పించుకుని అడవికి వచ్చాడు. వాని అదృష్టం కొద్దీ మృగాలను వశం చేసుకుని, వాటితో సేవలు చేయించుకుంటున్న సిద్ధుణ్ని చూశాడు. ఆషాఢభూతిలా ఆ సిద్ధుణ్ని ఆశ్రయించి పలువిద్యలు నేర్చుకున్నాడు. ముఖ్యంగా సిద్ధుడిలా మృగాలన్నీ వశమై ఉండే విద్య వాడికి వచ్చింది. చివరికి కాంచన యోగాన్ని ఉపదేశించమని కోరుకున్నాడు. కానీ సిద్ధుడు అంగీకరించలేదు.

''అహంకార, మమకార గ్రస్తులకు ఆ విద్య బోధించకూడదు. స్వార్థపరులకు చెప్పరాదు. కొంతకాలం పోయిన తరువాత నేర్పుతానులే'' అన్నాడు సిద్ధుడు.

భైరవుడు అప్పటికి వినయం ప్రకటించి ఊరుకున్నాడు. కానీ, తాను కోరిన విద్యను చారాయణునికి నేర్పుతానని సిద్ధుడు పలుకుతుంటే విని తట్టుకోలేకపోయాడు. ఆ తెల్లవారుజామున సిద్ధుడు స్నానం చేసి వచ్చి జపానికి కూర్చోబోతున్నాడు. చారాయణుడు స్నానానికి వెళ్లాడు. అటువంటి సమయంలో భైరవుడు ఒక పెద్ద బండరాయి తీసుకొచ్చి సిద్ధుడి బుర్ర బద్దలు కొట్టాడు.

ఆయన బ్రహ్మరంధ్రం పగిలి, రక్తం స్రవిస్తున్నది.

జరిగిన ఘాతుకాన్ని చూసి ఆశ్రమంలోని జంతువులన్నీ గగ్గోలు పడ్డాయి. భైరవుడంటే భయపడ్డాయి. చారాయణుడి వద్దకు పరుగున వెళ్లి, మొరపెట్టుకోసాగాయి. స్నానం చేస్తున్న చారాయణుడికి ఏదో జరగరానిది జరిగిందని అర్థమైంది. గబగబా ఆశ్రమానికి తిరిగి వచ్చి చూసేసరికి, సిద్ధుడు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. చారాయణుడి చేతిలోని కమండలం నేల జారిపోయింది.

''హా గురుదేవా! తపోనిధానా!'' అంటూ అతను కూడా నేలపై పడి మూర్ఛపోయాడు.

కొద్దిసేపటి తరువాత ఎలాగో తెప్పరిల్లాడు.

''మహాత్మా! నిన్నిలా చంపిన వారెవరు? నీ ఉపన్యాసం విన్నవారు అమృతాన్ని కూడా చిన్నచూపు చూస్తారే.. నువ్వు అజాతశత్రువు కదా.. నీపై ఈర్ష్య పూనిందెవరు? నీ ప్రభావం చేత జంతువులే వైరం మరిచి కలిసి మెలిసి బతుకుతున్నాయి కదా.. నిన్ను చంపిన క్రూరుడెవరు?'' అంటూ చుట్టూ పరికించాడు.

సిద్ధుని పక్కనే పడివున్న రాయి రక్తంతో తడిసి ఉండటాన్ని గమనించగానే చారాయణుడికి అర్థమైంది.

''భైరవా!'' అని ఉగ్రంగా అరుస్తూ వాణ్ని పిలిచాడు. భైరవుడు పరుగున వచ్చాడు.

''గురువుగారికి ఏమైంది?'' అంటూ అమాయకత్వం నటించబోయాడు.

''భైరవా! నీకీయన ఏం అపకారం చేశాడు? ఎందుకిలా పొట్టన పెట్టుకున్నావు?'' అని ఆవేశంగా ప్రశ్నించాడు చారాయణుడు.

''నేను పొట్టన పెట్టుకోవడం ఏమిటి? నాకేం తెలియదు. నువ్వే గురువును చంపి, నాపై నెడుతున్నావా?'' అని ఎదురు తిరిగాడు భైరవుడు.

''ఇక్కడ ఉన్నది మనమిద్దరమే. నువ్వు కాకపోతే ఇంత ఘోరం మరొకరు ఎవరో చేసి ఉండరు'' అని నిందించాడు చారాయణుడు. ఆ దెబ్బతో భైరవుడి అహంకారం మరింత దెబ్బతింది.